విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 07, ఏప్రిల్ 2023

జనరల్ బాడీ సమావేశమును జయప్రదం చేయండి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా ఏఐటీయుసి జనరల్ బాడీ సమావేశం రామకృష్ణ డిగ్రీ కాలేజీలోని వివేకానంద ఆడిటోరియంలో ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని ఈ సమావేశమునకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు హాజరవుతారని ఏఐటీయూసీ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓకు వినతి పత్రం సమర్పిస్తూ 11వ తేదీ జరిగే జనరల్ బాడీ సమావేశము నకు ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ బాడీ సమావేశంలో అంగన్వాడి వర్కర్స్, మధ్యాహ్న భోజనం పథకం స్కీం వర్కర్స్ లు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నింటి పైన, మరియు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ప్రధానమైన డిమాండ్ల పైన చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాల స్కీమ్ వర్కర్స్, మధ్యాహ్న భోజన పథకం అంగన్వాడీ టీచర్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ రుద్రవరం మండల కార్యదర్శి బాల నరసింహుడు, పార్టీ సభ్యులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర – చాగలమర్రి : పట్టణంలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ రఘురామిరెడ్డిలు గురువారం పరిశీలించారు. పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలల్లోని కేంద్రాలను పరిశీలించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ మాట్లాడుతూ పరీక్షా సమయంలో బయటి వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు పరీక్షా కేంద్రాల సమీపానికి రాకుండా విధినిర్వహణలో ఉన్న పోలీసులు పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ఎస్సై రమణయ్య పాల్గొన్నారు.

పెద్ద కంబలూరులో క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర – రుద్రవరం : మండల పరిధిలోని పెద్దకంబలూరులో అంబేద్కర్ జయంతి, ఈస్టర్ పండుగ సందర్భంగా ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్,ఏవైఎఫ్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పెద్ద కంబలూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 9నుండి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు మల్లి, కిషోర్‌లు తెలిపారు. ఆదివారం ప్రారంభమయ్యే ఈ పోటీలను ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా 20వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీని .రెండవ బహుమతిగా 10వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీని. బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఎంట్రీ ఫీజు 700.ప్రతి జట్టు ఆర్గనైజర్ల వద్ద 100 రూపాయలు చెల్లించి బాల్ కొనాలన్నారు. ప్రతి ఆటగాడు ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొని ఎవరి కిట్టు వారే తెచ్చు కోవాలన్నారు. తుది నిర్ణయం అంపైర్ దే.

రైతు భరోసా కోసం దరఖాస్తులు

విశాలాంధ్ర–బేతంచెర్ల రూరల్ : కొత్త గా పొలం పాస్ బుక్ వచ్చిన రైతులు ఈ సంవత్సరం రైతు భరోసా కోసం వెంటనే మీదగ్గర్లోని రైతు భరోసా కేంద్రం లో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా రైతు చనిపోయి ఉంటే నామినీ కి దరఖాస్తు చేసుకోవచ్చునని,కొత్త రైతులు రైతు భరోసా కోసం మీ రైతు భరోసా కేంద్రంను సంప్రదించి నమోదు చేసుకొని, ప్రభుత్వం అందించే లబ్ధి పొందాలని తెలిపారు.

పశువుల కొట్టం విషయంలో కేసు నమోదు

విశాలాంధ్ర – బనగానపల్లి : నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని వితలాపురం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామానుజన్ రెడ్డి పేర్కొన్నారు. వితలాపురం గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డి,ఉషారాణి పారు గోడ విషయంలో మనస్పర్ధలు వచ్చినట్లు అది దృష్టిలో పెట్టుకొని గాలి వెంకటేశ్వరరెడ్డికి చెందిన పశువుల కొట్టంలో పశువులను ఇద్దరు బయటికి వదిలి తాళం వేశారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రామానుజన్ రెడ్డి తెలిపారు.

లక్ష్మీరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – జూపాడు బంగ్లా : లక్ష్మీ రంగ నాథుని కృపా కటాక్షాలతో రాష్ట్రంలో వర్షాలు పుష్కలానికి కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి అని స్వామివారిని కోరుకున్నట్లు నంద్యాల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తర్తూరు లో శ్రీ లక్ష్మీ రంగనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గౌరు వెంకట్ రెడ్డికి సాధారణ స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీ రంగనాథ స్వామి అమ్మ వాళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గౌరు వెంకటరెడ్డి ని శాలువాతో పూలమాలతో సత్కరించారు. అర్చకులు వేదమంతాలతో ఆశీర్వచనాలు అందజేశారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మండల నాయకులు మందడి నారాయణరెడ్డి, గిరీశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, సంపత్ యాదవ్, ఉస్మాన్ భాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

విశాలాంధ్ర – వెలుగోడు : పట్టణానికి చెందిన వైసిపి నాయకులు తెలుగు చిన్న బుడ్డన్న తో పాటు సుమారు 50 కుటుంబాలు గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బి.సి.ల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ తోనే సరియైన న్యాయం జరుగుతుందని భావించి టిడిపిలో చేరుతున్నామన్నారు. టిడిపిలో చేరిన వారిలో తెలుగు రమణ, బాలస్వామి, గొల్ల శ్రీను, గొల్ల మల్లయ్య, బోయ మద్దిలేటి, చాకలి శ్రీనివాసులు, తూర్పు నాటి ముని, కె.రాజు, మంగలి వెంకటేష్, గొల్ల రాముడు , తెలుగు చిన్న రాముడు, చాకలి ఎల్లాస్వామి, గొల్ల వెంకట సుబ్బయ్య, తెలుగు వెంకట్ మొదలగు వారు టిడిపి కండువా కప్పుకున్నారు.హుసేన్ పుట్టినరోజు సందర్భంగా బుడ్డా చేతుల మీదుగా కేకు కట్ చేశారు. టిడిపి నాయ కులు శేషి రెడ్డి, అబ్దుల్ కలాం , ఎల్లాల కృష్ణుడు, హిదాయత్ అలీ ఖాన్, ఖలీల్, బోయరేవుల నాగశేఖర్, మోత్కూరు రామానాయుడు, మాధవరం ఆదిరెడ్డి, శివశంకర్, గుంతకందాల గాండ్ల శివన్న, చేరారు.

రాష్ట్ర ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర – నంద్యాల రూరల్ : మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైయస్సార్ పార్టీ మళ్లీ జగనన్న మా భవిష్యత్ జగనన్నే మా నమ్మకం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగాగ్రామాలకు వస్తున్నందువల్ల రాష్ట్ర ప్రజలందరూ....తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఎస్సీ సెల్ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దికెర కైలాస్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ చంద్రబాబు నాయుడు ఆదేశాలతో యువగళం అనే పేరుతో నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్రలకు నంద్యాల జిల్లా కేంద్రం నుండి 16వాహనాలతో అనంతపురం బయలుదేరినట్లు ఆయన తెలిపారు. కాగా వైయస్సార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కొత్త అవతారం ఎత్తి నియోజకవర్గాలలో పర్యటించడం సిగ్గుచేటయిన విషయమన్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష హోదా సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు నిత్యావసర సరుకుల అధిక ధరవల్ల, వంటగ్యాస్ పెట్రోల్ ధరలు రోజు రోజు పెరిగిపోతూ ఇబ్బంది పడుతున్న ముఖ్యమంత్రి ఏమాత్రం కేంద్రాన్ని ప్రశ్నించకుండా మౌనం వహించడం ఆయనకే చెల్లిందన్నారు. ఈ తుగ్లక్ రెడ్డి తన పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలనే తపనతో ఎమ్మెల్యేలను ప్రజలలోకి పంపించడం దారుణమని ఎద్దేవ చేశారు.రాష్ట్ర ప్రజలందరూ తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా రాబోయే ఎన్నికల్లో భవిష్యత్తు (మనదేనని) అందువల్ల టిడిపి కార్యకర్తలు ప్రజలందరూ బాధపడవద్దని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో శివశంకర్, భూపాల్, సూరబోయిన. పుల్లయ్య పాల్గొన్నారు.

నందమూరి, వైయస్సార్ నగర్‌లను అభివృద్ధి చేయండి

విశాలాంధ్ర – నంద్యాల : నంద్యాల పట్టణ శివారు ప్రాంతాలైన నందమూరినగర్, వైయస్సార్ నగర్‌ల పైన కూడా ఎమ్మెల్యే శిల్పా రవి కొంచెం దృష్టి పెట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ పేర్కొన్నారు. నందమూరినగర్, వైయస్సార్ నగర్ 37, 38వ వార్డులు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి ఏమాత్రం చెందలేదని, చాలా ప్రాంతాల్లో సిసి రోడ్లు లేవని, వర్షాకాలం వచ్చిందంటే మట్టి రోడ్లపై మోకాళ్ళ లోతు నీటిలో విష పురుగులతో నిండి ఉంటాయని, అదే విధంగా డ్రైనేజీలు లేవని, వీధి దీపాలు కూడా సరిగా లేవన్నారు. దోమలతో మంచినీటి సమస్యతో ఈ ప్రాంతవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు ఇంచుమించు పదివేల ఓట్లు ఉండవచ్చని, అయినా రాజకీయ నాయకులు ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లకు డబ్బులు పంచి అధికారంలోకి రావచ్చని అనుకుంటున్నారు కానీ ఇప్పుడు ప్రజలు ఈ ప్రాంతంలో అనుభవిస్తున్న బాధల ముందు ఆ డబ్బు ప్రభావం ఏమాత్రం పనిచేయదన్నారు. ఇప్పటికైనా నందమూరి నగర్, వైయస్సార్ నగర్లో మౌలిక వసతులు కల్పించి అక్కడి ప్రజల మన్ననలు పొందాలని, వారి ఆగ్రహానికి గురి కావద్దని ప్రసాద్ హితవు పలికారు.

ప్రభుత్వ అండదండలతోనే సోలార్ కంపెనీ దౌర్జన్యాలు

విశాలాంధ్ర – పాణ్యం : పాణ్యం మండలం, పిన్నాపురం గ్రామంలో సోలార్ కంపెనీ నిర్మాణానికి అవసరమైన భూము లను తీసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక అధికారులు నిర్లక్ష్య వైఖరి అనుసరించటం వల్ల భూములు కోల్పోయి నటువంటి రైతులకు నష్టపరిహారం సక్రమంగా అందడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు అన్నారు. గతంలో గ్రామసభ నిర్వహించకుండా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా దౌర్జన్యంగా భూ సేకరణ చేపట్టారని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు కల్పించాల్సిన సౌకర్యాలు నష్టపరిహారం చెల్లిం చిన తర్వాత పనులు చేపట్టాలని ఉన్న నిబంధనలను ఉల్లం ఘించి దౌర్జన్యంగా ఒక్కొక్క రైతుకు ఒక్కో విధంగా నష్టపరిహారం చెల్లించారని అన్నారు. ప్రస్తుతం 212సర్వే నెంబర్లు సాగులో ఉన్నటువంటి రైతుల పేర్లను భూమి విస్తీర్ణ వివరాలను సేకరించి, వివరాలను బహిర్గతం చేయకుండా, సాగులో ఉన్న రైతులతో ఏమాత్రం చర్చించకుండా, ఎంత నష్టపరిహారం చెల్లిస్తారో ప్రకటించకుండానే దౌర్జన్యంగా సోలార్ కంపెనీ వాళ్ళు పోలీసులు అండదండలతో రైతుల భూముల్ని త్రవ్వివేస్తున్నారని అన్నారు. చాలా రోజుల నుండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం పార్టీ, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పిన్నాపురం గ్రామ రైతులు 212 సర్వేనెంబర్ భూమిలో సాగులో ఉన్న వారికి ఇచ్చే నష్టపరిహారం పై గ్రామ సభ పెట్టి చర్చించి ధర నిర్ణయించమని అనేక మార్లు జిల్లా కలెక్టర్,ఆర్డీవో,స్థానిక ఎమ్మార్వోకు ప్రజాప్రతిథులకు విన్నవించుకున్న నేటి వరకు కనీసం సర్వే కూడా చేయకుండానే నిర్లక్ష్యంగా వ్యవహరించినందువల్ల ప్రస్తుతంరైతులు ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకుని పరిస్థితి దాపురించింది అన్నారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన ఎల్లా సుబ్బయ్య అనే రైతు తన భార్య పిల్లలతో కలిసి దౌర్జన్యంగా తన భూమి లో తవ్వకాలు జరపటానికి వచ్చిన సోలార్ కంపెనీ ప్రతిధు లతో వాదించి గత్యంతరం లేక పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఇలాంటి ఒత్తిడిని ఎదుర్కొనేటువంటి అనేకమంది రైతు లకు మనో ధైర్యాన్ని కల్పించి, వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పిన్నాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించాలని, 212 సర్వేనెంబర్ సాగుదారుల వివరాలు వెంటనే ప్రకటించాలని, గ్రామసభలోని నష్టపరిహారం ఎంత చెల్లించేది ప్రకటించి రైతుల ఆమోదంతో తీర్మానించాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తూనే, భూమిలేని పేదలకు కూడా ఉపాధి కల్పించాలని సోలార్ కంపెనీ వాళ్ళ దౌర్జన్యాల నుండి ప్రజలని రక్షించాలని వారు ప్రకటన ద్వారా కోరారు. గ్రామంలో పర్యటించి వివరాలు తెలుసుకున్న రైతు సంఘం నాయకులు ఆత్మహత్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావు. ఎవరు కూడా ఇలాంటి చర్యలకు పాల్పడవద్దు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. రైతులందరూ ఐక్యమత్యంతో ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవాల అని అన్నారు.

20లక్షలతో సిసి రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర – నంద్యాల : మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో కౌన్సిలర్ తోహిదా బి, వార్డు ఇంచార్జ్ నిజాం ఆధ్వర్యంలో ఉప్పరి పేట బాల్కొండ హాల్ వీధిలో 20 లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డును నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే శిల్ప మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగి శెట్టి శ్రీధర్, పాంషావలి, వైసిపి, వైసీపీ కౌన్సిలర్స్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

విశాలాంధ్ర – చాగలమర్రి : వైద్యం కోసం పల్లెలు, పట్టణం నుంచి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం వైద్యాధికారులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వారు పరిశీలించారు. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సహాయ సహకారాలతో వైద్యశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలోవైద్యులు అంజలి,ఇమ్రాన్,సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి, కనకాద్రి పల్లి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) లలో నాడు నేడు పేజ్–1 కింద నిర్మించిన అభివృద్ధి పనులను ఏపిఎంఐపి ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఎంపీడీవో సుబ్బరాజులతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. పాఠశాలలో మంచి నీటి సరఫరా, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, ఆర్వో ప్లాంట్ పనితీరు, లెడ్ టీవీ పని విధానాన్ని ప్రధాన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.తుమ్మలపెంట గ్రామానికి వెళ్లి హౌసింగ్ లేఔట్ నందు అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం, అప్రోచ్ రోడ్డు తదితర వాటిని పరిశీలించారు.వీరివెంట ఎంఆర్సి అకౌంటెంట్ కాంతారావు తదితరులు ఉన్నారు.

తెదేపాను వీడిన వారంతా తిరిగి రావాలి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : గతంలో టిడిపిలో ఉండి వివిధ కారణాలతో దూరమైన వారందరూ తిరిగి టిడిపిలోకి రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మల్లికార్జున శాస్త్రి వీధికి చెందిన బండారు విజయభాస్కర్ కుటుంబంతో పాటు మరి కొంతమంది మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్, భూమా జగద్విఖ్యాత్ రెడ్డి ల సమక్షంలో వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. భూమా అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్రమంతా జె ట్యాక్స్ నడుస్తోందని, ఆళ్లగడ్డలో మాత్రం ఐ ట్యాక్స్ నడుస్తోందని ఆమె ఆరోపించారు. వైకాపాలో పార్టీని నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్నారు. కేవలం డబ్బు రాజకీయాలునడుస్తున్నాయన్నారు. కేసుల భయంతో, బిల్లులు రావడం లేదన్నా ఆలోచనతో భూమా కుటుంబంతో అనుబంధం ఉన్న పలువురు వైకాపాలో చేరారన్నారు. భూమా ముద్ర ఉన్న మీకు అక్కడ న్యాయం జరగదన్నారు. పాత వారంతా తిరిగి రావాలని మీకు భూమా ఇంటి తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయని, సొంత ఇంటిలోకి మీరు తిరిగి రావచ్చని, మీ విలువ ఎప్పటికీ తగ్గదని అఖిలప్రియ స్పష్టం చేశారు. భాస్కర్ కుటుంబం తెలుగు దేశం పార్టీలో చేరడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుండా మనోహర్, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, కందుకూరు మాధవరెడ్డి, చింతకుంట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ పై అవగాహన

విశాలాంధ్ర – అవుకు : మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మంగంపేటలో వైద్య అధికారి డాక్టర్ టి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వడ దెబ్బ పై ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ప్రజలందరూ ఉదయం 11గంటలకు వరకు మాత్రమే పనులు ముగించుకుని ఇండ్లకు చేరుకోవాలని, ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో శారీరక శ్రమ చేయకూడదని,అలసట, వికారం, వాంతులు శ్వాస తీసుకోవడంలో వేగం పెరగడం, నోరు కళ్ళు పొడి మారడం శరీరంలో ఎక్కడి నుంచైనా రక్తస్రావం కావడం, డిహైడ్రేషన్ లక్షణాలు ఉన్న వెంటనే ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని త్రాపుకుంటూ ప్రభుత్వ హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స తీసుకోలేనని అన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా నాలుగు లీటర్ల నీరు త్రాగవలయునని అన్నారు. హెల్త్ సూపర్వైజర్ కమల్ సాహెబ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.లింగమయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాధురి ఆరోగ్య కార్యకర్త హేమలత,ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అన్ని రకాల వసతులు ఉన్నాయి

విశాలాంధ్ర – ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ బృందం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాగలమర్రి, ఉయ్యాలవాడ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కావలసిన తాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు, అన్ని రకాల మౌలిక వసతులు విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద ఉన్నాయన్నారు. మోడల్ స్కూల్ లో హిందీ పరీక్షకు 180 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 176 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 175కు 175 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ డిపార్ట్మెంటల్ అధికారులు నూర్జహాన్, వెంకటశకుంతల, దస్తగిరిరెడ్డి, సుధాకర్ లు తెలిపారు.

బార్ ఎన్నికల్లో "నోటు" గెలిచింది

విశాలాంధ్ర–డోన్ రూరల్ : డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ""నోటు"" గెలిచింది.ఓటుకు నోటు పంచడంతో ఎన్నికల్లో నోటు ఓటును శాశించింది. పోటీ చేసిన అభ్యర్థులు సమానంగా ఓటుకు పదివేలు పంపిణీ చేసినప్పటికీ....ఎక్కువ మొత్తం ఎవరిచ్చారు వారే గెలిచారు. రసవత్తరంగా జరిగిన ఎన్నికల్లో నోటు గెలిచిందని అభిప్రాయపడుతున్నారు. ఇద్దరు కూడా ఓటుకు పదివేల చొప్పున పంపిణీ చేసినప్ప టికీ గురువారం ఉదయం రాజశేఖర్ రెడ్డి 1000 అదనంగా పంచడంతో ఆయన గెలుపు బయటపడింది. డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి శేఖర్ రాజశేఖరెడ్డి, కల్లా మహేశ్వర్ రెడ్డిలు పోటీ చేశారు. అయితే గురు వారం విలువడిన ఫలితాల్లో 51 రాజశేఖర్ రెడ్డి గెలిచారు.రాజశేఖర్ రెడ్డి, కల్లా మహేశ్వర రెడ్డిలు వేర్వేరుగా ప్యానెల్ ల్లో అభ్యర్థులను దింపారు. అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి శేష శయన రావు, రాజశేఖర్ ప్యానెల్ ల్లో గెలిచారు. అయితే కల్లా మహేశ్వర రెడ్డి ప్యానెల్ ల్లో కేవలం ట్రెజరీ మంగమురి సీను మాత్రమే గెలుపొందారు.

బార్ఎన్నికల్లో 25 లక్షల ఖర్చు.....: డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో 25లక్షల పై మాటే ఖర్చయింది. రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు అధ్యక్షుడుగా పనిచేశారు. అయితే మూడోసారి కూడా ఆయనే ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకోవడంతో... కల్లామహేశ్వర రెడ్డి హైకోర్టు బార్ కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల నడపాలని హైకోర్టు బార్ నిర్ణయించింది. ఈ మేరకు ఇరువురు అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరీకి పోటీకి అభ్యర్థులను బరిలో దింపారు.అయితే ఎన్నడు లేని విధంగా రాజశేఖర్ రెడ్డి, కల్లా మహేశ్వర్ రెడ్డిలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేశారు. తమ ప్యానెల్ ను గెలిపించుకునేందుకు దాదాపు 120 ఓట్లకు ఓటుకు పదివేల చొప్పున ఇరువురు పంపిణీ చేశారు.తీరా గురువారం ఉదయం ఎన్నికలు జరిగే సమయంలో రాజశేఖర్ రెడ్డి ఓటుకు పదివేల తో పాటు అదనంగా వెయ్యి పంపిణీ చేశారు. దీంతో ఆయన గెలుపు బయట పడింది. ఎప్పుడు లేని విధంగా డోన్ బారాసోసియేషన్ ఎన్నికల్లో తీవ్ర పోటీతో 25 లక్షల ఖర్చు చేశారు.

సత్తా చాటుకున్న ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి..... రాజశేఖర్‌రెడ్డి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సత్తాను చాటుకున్నారు. అధ్యక్షులుగా ఆయన, కార్యదర్శిగా శేషశయన రావు, కోశాధికారిగా పులి దామోదర్ ను దింపారు.ప్రధానంగా అధ్యక్షుడు, కార్యదర్శి పోస్టులను కైవసం చేసుకోగా... ట్రెజరీ పోస్ట్ కల్లా మహేశ్వర రెడ్డి ప్యానెల్ మంగమురి సీను గెలుపొందారు.

రాజశేఖర్ రెడ్డిని అభినందించిన బుగ్గన.....: బార్ అసోసియేషన్ ఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి ప్యానెల్ ను మంత్రి బుగ్గన రాజారెడ్డి అభినందించారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఫలితాలు వెలువడిన తర్వాత రాజశేఖర్ రెడ్డి పానెల్ ఊరేగింపుగా మంత్రి బుగ్గన ఇంటికి చేరుకున్నారు. మంత్రి బుగ్గన రాజశేఖర్ రెడ్డిని అభినందించి... ఇలాగే కలిసికట్టుగా ఉండి ఉండాలని సూచించారు. త్వరలోనే సబ్ కోర్టుకు నిధులు విడుదల చేసి పనులకు పూర్తయి విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎన్నికలకై ప్రజలు ఎదురు చూస్తున్నారు

విశాలాంధ్ర – చాగలమర్రి : రాష్ట్రం మొత్తం ప్రజలు ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయి,టీడీపీని గెలిపించాలని ప్రజలు వేచి చూస్తున్నారని మాజీ మంత్రి,టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ తెలియజేశారు.గురువారం చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలను తెలుసుకొని తీర్చేది ఒక్క టీడీపీనే ఆమె వివరించారు.రాష్ట్రంలో వైసీపీ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సమస్యలను తీర్చడంలో కాకుండా టీడీపీ నాయకులపై,టీడీపీకి ఓటేసిన వారిపై కక్ష సాధింపు చర్యలు,ప్రజలను ఇబ్బందులు పెట్టే కార్యక్రమాలపై తప్ప సమస్యల పరిష్కారాలపై దృష్టి సారించాలేదన్నారు.ఆళ్ళగడ్డలో ఒకే కుటుంబానికి రెండు పదవులు వచ్చిన కూడా ఈ ప్రాంతానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉండి ప్రజల వద్ద కక్కూర్తి పడి పంచాయతి చేసిన,బోర్లు వేసిన,ఉద్యోగాల విషయంలో కూడా అవినీతికి పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.చాగలమర్రి లో వైసీపీ నుండి టీడీపీ లోకి వచ్చిన వారిని ఇబ్బందులు పెట్టడం తప్ప అభివృద్ధి పై దృష్టి సారించాలేదన్నారు.టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష,మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు,నంద్యాల బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు , మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, నాయకులు కొలిమి ఉసేన్ వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, గఫార్,వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా, కొలిమి సోను,వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి,జెట్టి నాగరాజు, రామసుబ్బయ్య,నాగూర్, పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అండ

విశాలాంధ్ర – కొత్తపల్లి : మహిళాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పొదుపు మహిళలు ప్రభుత్వం నుంచి వస్తున్న ఆసరా నిధులు సద్వినియోగం చేసుకొని కుటుంబాలను అభివృద్ధి పథంలో నడుపుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. గురు వారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న ఎంపీడీవో కార్యాల యం ఆవరణంలో ఏపిఎం పుల్లయ్య ఆధ్వర్యంలో వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. నందికొట్కూరు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలనుదే శించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో 532 స్వయం సహాయ సంఘాల మహిళలకు సిఎం జగన్ రూ 3,32,18,191 నిధులు మంజూరు చేశారన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం...: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేద ప్రజలకు వరమని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో మండల వైద్యాధికారి వినోద్ కుమార్ దీప నాగవేణి ఆధ్వర్యంలో 104 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిం చారు.ఎంపీడీవో దాసరి మేరి తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఈఓఆర్‌డి శ్రీనివాసులు నాయుడు సర్పంచులు విజయకుమార్ చంద్రశేఖర్ యాదవ్ మారెన్న వైఎస్ఆర్సిపి నాయకులు జిఎండి రఫీ శ్రీనాథ్ రెడ్డి మద్దిలేటి యాదవ్ సాయిరాం సుబ్బరాయుడు వైఎస్ఆర్సిపి నాయకులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర – ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామంలో నంద్యాల శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 160మందికి జ్వరం,దగ్గు, సుగర్ వ్యాధి,కీళ్ల నొప్పులు,తదితర వ్యాధులకు సంబంధించి వైద్యులు వినయ్ గౌడ్, హర్షవర్ధన్, మౌనిక, అభిషేక్ రెడ్డిలు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 25మందికి కీళ్ల నొప్పులు,కంటి జబ్బుతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య కోసం నంద్యాల ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనపాల సాయిరెడ్డి పాల్గొన్నారు.

మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం పై సమీక్ష

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోనీ పాలసాగరం, ఎంవి నగర్, పాతూరు వీధి, పెద్దన్న వీధి, కుద్బావీధి, అహోబిలం రోడ్డులో ఉన్న సచివాలయాల్లో నేటి నుండి చేపట్టనున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పై గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, టౌన్ కన్వీనర్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి ల ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు నాయబ్ రసూల్, మాదం మరియమ్మ, వరాలమ్మ,నాగేశ్వరమ్మ, బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 07, ఏప్రిల్ 2023

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండలంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతుందని పోలీసు ఉన్నతాధికారులు నిఘా ఏర్పాటు చేసి యువత చెడు మార్గం వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ,రమేష్‌లు కోరారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 31వ తేదీ ప్రారంభమైన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు యువత టీవీలకు అతుక్కుపోయారని, మరోవైపు పందెం రాయుళ్ళ సందట్లో సడేమియా అనే చందంగా ఒకవైపు క్రికెట్‌ను ఆస్వాదిస్తునే మరోవైపు తమదైన శైలిలో బెట్టింగ్ కాస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగులు ఇప్పుడు జిల్లా, పట్టణ, మండలాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రికెట్ బెట్టింగ్లు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో చిక్కుకున్న యువత జేబులు గుల్ల చేసుకుంటు. కొందరు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్ పై పోలీసుల నిఘా పెడుతున్న చాటు మాటుగా వీటిని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల నాయకులు రంగస్వామి, సుధాకర్, ధను, శ్రీకాంత్, అంపన్న, ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి రేవన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : కోసిగి, ఎమ్మిగనూరు రహదారులు మరమ్మతులు చేపట్టాలంటూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామం నుండి నాల్గవ మైలు వరకు సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యన్న, మంత్రాలయం మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర, ఏఐకెఎస్ తాలూకా కార్యదర్శి ఆంజనేయ మాట్లాడుతూ రహదారుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని ఆరోపించారు. రహదారుల కోసం ప్రభుత్వం 20కోట్లు విడుదల చేసి నాలుగు నెలలు కావస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేశంలో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానని భూటకపు మాటలు చెపుతున్నారన్నారు. రోడ్లు, ఇళ్లు, రాజధాని నిర్మాణంలో అవద్ధాలు చెప్పి, నిధులన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పి ఇంటికి పంపించే సమయం దగ్గరలోనే ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కోసిగి నుంచి ఎమ్మిగనూరు వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని లేనిపక్షంలో వామపక్షాలుగా ప్రజా సమస్యలు తీర్చేవరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు తిక్కన్న, హనుమంతు, గిడ్డయ్య, రామాంజనేయులు, నాగరాజు, వీరేష్, హుస్సేన్, రైతు సంఘం సీనియర్ నాయకులు మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - పత్తికొండ : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టి కంటయ్య, రంగన్నలు డిమాండ్ చేశారు. గురువారం స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి పంచాయతీ డివిజనల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు గత ఆరు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం వలన వారి కుటుంబాలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించమని అడిగితే విధుల నుండి బహిష్కరించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. స్వచ్ఛభారత్ కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకొని పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు మాదన్న, రాజప్ప, స్వచ్ఛభారత్ కార్మికులు పరశురాముడు, సోమశేఖర్, రంగన్న,నాగరాజు,రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోనే అట్టేకల్లు గ్రామం పంచాయితీలో ఉపాధి హామీ పథకం కింద ఇప్పించాలంటూ ఉపాధి హామీ పథకం కూలీలు గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్భంగా ఉపాధి కూలీలు నాగేంద్ర, రంగన్న, ఉరుకుందు, వీరేష్, విజయ్, వెంకటేష్, చాంద్ భాషా, ఉరుకుందప్ప తదితరులు మాట్లాడుతూ అట్టేకల్లు గ్రామ పంచాయితీగా ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టేకల్లు గ్రామపంచాయతీ మజారా గ్రామైన ఐనకల్లు గ్రామాలలో ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి అధికారులకు, గ్రామ సర్పంచ్ దగ్గర ఎంత మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయాల కారణంగా గ్రామ సర్పంచ్ గ్రామంలో పనులు కల్పించేందుకు గ్రామసభ తీర్మానం ఇవ్వకుండా ఉపాధి కూలీల కడుపు కొడుతున్నారని వాపోయారు. తక్షణమే మా గ్రామపంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఏపీఓ కృష్ణ మోహన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి కూలీలు రామంజి,లక్ష్మన్న, రమేష్, ఈరన్న, చిన్న మల్లప్ప, పెద్ద ఊరుకుందులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆర్థికసాయం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని కల్లు బావి ఏరియాలో వాల్మీకి సామాజిక వర్గం కలిసికట్టుగా ఐకమత్యంతో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం మేరకు టీడీపీ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మను అడిగిన వెంటనే తనవంతుగా రూ,11 వేలు ఆర్థిక సాయం చేసి తన అవునత్యాన్ని చాటుకున్నారు. వాల్మీకులు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించేందుకు ప్రతి కుటుంబంలో భాగస్వామ్యులు గా కలుపుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కల్లుబావి వాల్మీకి కుటుంబ సభ్యులు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపే శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. కల్లుభవి రాజు, గుడిసె శ్రీరాములు రామస్వామి, తదితరులు ఉన్నారు.

తితిదే ఆధ్వర్యంలో దేవాలయాల అభివృద్ధి

విశాలాంధ్ర - కౌతాళం : మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అన్యక్రాంతమైన దేవాలయాలను తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయడం జరుగుతుందని సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడు అన్నారు. గురువారం ఆయన మండలంలోని గ్రామాలలోని దేవాలయాలను పరిశీలించారు. అలాగే అభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకున్న దేవాలయాల వివరాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని బసవ లింగేశ్వర, గంగాపుత్ర, బీర లింగేశ్వర, సుంకలమ్మ దేవి, త్రయంబ కేశ్వర ఆలయాలను పరిశీలించారు. తిరుపతి దేవస్థానం వారు చేపట్టిన గొప్ప అవకాశాన్ని ప్రతి దేవస్థానం వారు వినియోగించుకుని దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి సహకారంతో గ్రామాలలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని మండల నాయకుడు ప్రహల్లాద చారి అన్నారు. గ్రామ సర్పంచ్ పాల్ దినాకర్, మండల ఉపాధ్యక్షులు బుద్ధి స్వామి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ కమిటీ డైరెక్టర్ ఏంకోబ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రైతు భరోసా డబ్బులు పడని రైతులు ఎవరికైనా ఉంటే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ పర్యవేక్షించారు. లబ్ధిదారులు ఎవరైనా చనిపోయినట్లైతే వారి పేర్లకు బదులుగా కుటుంబీకుల పేర్లు చేర్చడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. అలాంటి వారు ఉన్నట్లయితే మరణ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు తీసుకొని ఆర్బీకే సిబ్బందిని కలిస్తే కుటుంబీకులను లబ్ధిదారుల జాబితాలో చేరుస్తామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ యల్లప్ప, వ్యవసాయ సలహా మండలి సభ్యులు వలి భాషా,వెంకటేశ్, సిబ్బంది రమాదేవి, రవితేజ, రైతులు పాల్గొన్నారు.

సి.బెళగల్ : కొత్తగా పొలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని కొత్త పాసు బుక్కులు కలిగి అర్హత కలిగి ఉన్న రైతులు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి అక్కడ ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులతో రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. వ్యవసాయ సిబ్బంది గొల్లలదొడ్డి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలన అవలంబిస్తున్న జగన్

విశాలాంధ్ర - హొళగుంద : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలన అవ్వాలనిపిస్తున్నారని ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. వందవా గిలి,మరలమడికి,గజ్జహల్లిలో గురువారం ఇదేమి కర్మ కార్యక్రమాన్ని చేపట్టారు.ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సామాన్యులపై భారీ పన్నులు వేసి మూయలేని భారం వేసిందని ఆరోపించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కొనసాగితే రాష్ట్రం సుభిక్షంగా ఉండడమే కాకుండా ప్రజలకు అన్ని విధాన సౌకర్యాలు అందుతాయని అన్నారు. చంద్రబాబు వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు గట్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, నాయకులు సత్యనారాయణరెడ్డి, పాండురంగ రెడ్డి, పంపారెడ్డి,కరిలింగ రాజశేఖర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,శేషన్న, నబి రసూల్, అబ్దుల్లా,సర్పంచ్ సుధాకర్ ,నల్లారెడ్డి వీరేంద్ర,సీతయ్య, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ కురువ దేవన్న టిడిపిలో చేరినట్లు మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య తెలిపారు. గజ్జిహళ్లి, పోత లింగస్వామి,మార్లముడికి ఆంజనేయ స్వామిని కోట్ల సుజాతమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు సుజాతమ్మశాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతించారు.

వైభవంగా రథోత్సవం

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని గజ్జహల్లిలో గురు వారం పోతులింగేశ్వర స్వామి మహారథోత్సవం వైభవంగా జరిగింది. పురోహితుల వేదమంత్రాలు పటిస్తూ మేళ తాళాలు బీరప్ప డోలు వాయిస్తూ అశేష జనవాహిని మధ్య రథాన్ని లాగారు. రథానికి భక్తులు పూలు పత్రి చెల్లి తమ మొక్కుబడిని చెల్లించుకున్నారు. రథోత్సవంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు తిమ్మారెడ్డి ,మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు అనుమంత్ రెడ్డి,సర్పంచ్ ఆరుభట్ల నాగమ్మ ,మండల ఉపాధ్యక్షురాలు మహాదేవమ్మ,భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కబడ్డీ విజేతులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆలూరు నియోజకవర్గం మాజీ టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ ,సర్పంచ్ ఆరుభట్ల నాగమ్మ ,మాజీ జెడ్పిటిసి సభ్యుడు తిమ్మారెడ్డి ,మండల టిడిపి కార్యదర్శి రామలింగ ,కబడ్డీ విజేతులకు బహుమతులను ప్రధానం చేశారు. రథోత్సవంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండడానికి ఎస్ఐ అబ్దుల్ జహీర్ గట్టి బందోబస్తు నిర్వహించారు. చిన్న ఆట లో రామలింగేశ్వర స్వామి రథోత్సవం మార్లమడికి ఆంజనేయ స్వామి రథోత్సవంగా జరిగింది.

ఘనంగా బీవీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు టౌన్ : ఎమ్మిగనూరు నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బివి జయ నాగేశ్వర రెడ్డి జన్మదిన వేడుకలు గురు వారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంతో పాటు అన్ని వార్డుల్లో, గ్రామాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.బీవీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో గల పారిశుధ్య కార్మికులు సుమారు 50 మందికి ఎమ్మిగనూరు మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్, 21వ వార్డు కౌన్సిలర్ వీజీఏ దయాసాగర్, ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు ఉసేన్ పీరా21వ వార్డు టిడిపి కమిటీ ఆధ్వర్యంలో చీరలను పంపించి పంపిణి చేశారు. 21వ వార్డు టిడిపి నాయకులు ఎల్లప్ప,గడ్డం రవి,శ్రీకాంత్, యూకే రాజశేఖర్, రంగన్న, హనుమంతమ్మ, రంగమ్మ, ఉమాదేవి, సత్యమ్మ పాల్గొన్నారు

నేడే రథోత్సవం

విశాలాంధ్ర - సి.బెళగల్ : కొలిచేవారికి కొంగుబంగారంగా కోరిన కోర్కిలను తీర్చే స్వామిగా, మహిమాన్వితునిగా ప్రసిద్ధిగాంచిన కోన వెంకటేశ్వరస్వామి సి బెలగల్ మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న కొండపై వెలసిన స్వామి రథోత్సవం నేడే అశేష జనవాహిని మధ్య జరుగుతుంది.

స్వామి చరిత్ర...: పూర్వం గొర్రెల కాపరులు కోడుమూరు హంద్రీ నది తీర ప్రాంతంలో గొర్రెలను మేపుకొనుచుండగా వారికి వెంకటేశ్వర స్వామి విగ్రహం దొరికినట్లు పురాణాలు చెబుతున్నాయి. గొర్రెల కాపరులు అక్కడి నుండి గొర్రెలను మేపుకుంటూ స్వామి విగ్రహం మోసుకొని రావడం జరిగిందని అయితే కృష్ణదొడ్డికొండపైకి రాగానే స్వామివారి విగ్రహం బరువు కావడంతో ఆ గొర్రెల కాపరులు స్వామి విగ్రహాన్ని అక్కడే ప్రతిష్టించడం జరిగింది. అని అప్పటి నుండి ఇప్పటివరకు స్వామి వారు కోరిన వారికి కోర్కెలు తీర్చే స్వామిగా కొలిచిన వారికి కొంగుబంగారంగా మహిమాన్వితునుగా ప్రజలతో పూజలను అందు కుంటూ విరాజిల్లుతున్నాడు. స్వామివారి రథోత్సవం రోజున సిబెలగల్లు మండలంలోని గ్రామాల ప్రజలే కాక ఇతర జిల్లాల నుండి కూడా,కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి కూడా స్వామివారి రథోత్స వాన్ని తిలకించడానికిభక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శించుకోలేని పేదవారు సైతం తలనీలాలు సమర్పించి కోన వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే అంతే పుణ్యం వస్తుందని ప్రజల ప్రగాఢ నమ్మకం. ప్రతి ఏటా చైత్రమాసంలో పౌర్ణమి రోజున స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ స్వామివారి రథోత్సవం రోజున మండల కేంద్రమైన సి బెళగల్‌తో పాటు మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలైన బూరాందొడ్డి, గొల్లలదొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, బ్యాతోలి, గోనెగండ్ల మండలం, ఎమ్మిగనూరు మండలం తదితర మండల ప్రజలు కూడా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవటం ఆనవాయితీ.

కోన వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఆదిమూలం సతీష్ : రాష్ట్ర వైద్య విభాగం జనరల్ సెక్రెటరీ ఆదిమూలపు సతీష్, కృష్ణదొడ్డికొండపై వెలసిన కోన వెంకటేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. తెల్లవారితే శుక్రవారం స్వామివారి రథోత్సవం అయినందున స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన ఆది మూలపు సతీష్‌కి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి ప్రసాదాలను అందజేశారు. ఆదిమూలపు సతీష్ వెంట బూరాందొడ్డి రాజశేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మి కాంతారెడ్డి,రవి కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం... పేదలకు వరం

విశాలాంధ్ర- పత్తికొండ : ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని హొసూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ఇకపై ఇంటి వద్దకే వైద్య సేవలు అందే లా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం శుభ పరిణామం అని, ప్రతి ఇంటికి డాక్టర్ స్వయంగా వెళ్లి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఎంపీపీ నారాయణ దాస్, ఎంపీటీసీ నెట్టికల్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, గ్రామ నాయకులుమోహన్‌కృష్ణ,చంద్రశేఖర్‌రెడ్డి,బనగాన శ్రీనివాసులు, ఎంపీడీవోపార్థసారథి,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే వైద్య సదుపాయం కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎండిఓ దాస నాయక్ అన్నారు. ఎల్లార్తిలో గురు వారం వైయస్సార్ ఇంటి వద్దకే వైద్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేద ప్రజలకు వైద్య సౌకర్యం అందగా తీవ్ర ఇబ్బంది పడేవారని ఇప్పుడు అలాంటి సమాధిస ఏర్పడదని అన్నారు. ప్రజలు వైద్య సౌకర్యాన్ని పొంది ఆరోగ్యంగా ఉండాలని కోరారు. వైకాపా నాయకుడు ఎస్కేగిరి వైద్యాధికారి రాజశేఖర్, సిబ్బంది ఉమా, నీరజ్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని మండల అధ్యక్షులు డాక్టర్ వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన క్రిష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో వైయస్సార్ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుండి 14వ తేది వరకు జగనే మన భవిష్యత్తు జగనే మన నమ్మకం అనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జడ్పిటిసి కే ఈ సుభాషిని , మండల కన్వీనర్ వెంకటరాముడు,ఎంపిటిసి మహాలక్ష్మి మండల యూత్ అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణమూర్తి, భీమ్ రెడ్డి ,నక్కశాలు, జయరాం రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని టీ. గోగులపాడు గ్రామంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్‌ను మండల అధ్యక్షులు వెంకటరామ్ రెడ్డి,జెడ్పిటిసి కే ఈ సుభాషిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మోహన్ కుమార్, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, తిమ్మరాజు ఎంపిటిసి ప్రభాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధ రామేశ్వరుని రథోత్సవం

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని చిన్న హెూతురు గ్రామంలో కొలిచేవారికి కొంగుబంగారంగా వెలిసిన శివయోగి సిద్ధ రామేశ్వర స్వామి రథోత్సవం గురువారం కనులు పండుగగా వేలాది భక్తుల మధ్య జరిగింది. ఉదయం ఆలయంలో శివయోగి సిద్ధ రామేశ్వర స్వామీని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి గంగపూజ, ఆకుపూజ, కుంకుమార్చన, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళ హారతి, గణపతిపూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సుంకులమ్మ అవ్వ దేవాలయంలో శివయోగి సిద్ధ రామేశ్వర స్వామి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడినుంచి స్వామివారి పాదాలను మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా స్వామివారి ఆలయం వరకు తీసుకువచ్చి పూజలు నిర్వహించి,స్వామికి సమర్పించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరులు శివయోగి సిద్ధ రామేశ్వర స్వామిని రథోత్సవంలో కూర్చోబెట్టి స్వామివారి నామస్వరంతో జనసంద్రం మధ్య రథోత్సవాన్నిలాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వరప్రసాద్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంజునాథ్, సర్పంచ్ హరికృష్ణ, ఎంపిటిసి మౌనిక, బసవరాజు, మాజి సర్పంచ్ వరదరాజులు, లక్ష్మన్న, నేట్టప్ప, మధు, రిటైర్డ్ విఆర్ఓ వీరభద్ర గౌడ్‌లు పాల్గొన్నారు.

బనువనూరులో సుంకులమ్మవారి రథోత్సవం : మండల పరిధిలోనే బనవనూరు గ్రామంలో సుంకులమ్మ వారితోత్సవాన్ని అంగరంగ వైభవంగా కనుల పండగ నిర్వహించారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొంది.సర్పంచ్ పెద్దిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ హాసన్, రంగన్న, ఎంపీటీసీ ప్రభావతమ్మ, హనుమంతు రెడ్డి, మాజీ సర్పంచ్ సీతారామరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

విశాలాంధ్ర - హొళగుంద : ఆదోని డివిజన్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డిప్యూటీ డిఈఓ సుకుమార్ అన్నారు.హాళహర్వి, హొళగుంద పరీక్షా కేంద్రాలను గురువారం తనిఖీ చేసినట్లు తెలిపారు. డివిజన్లో 16,200మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతు న్నారని పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామని అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఇష్టంతో పరీక్షలు రాయాలని కష్టంతో వద్దు అని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కోసం అన్ని వసతులు కల్పించామని ఎలాంటి కొరత లేకుండా చేశామని అన్నారు. ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసామని పకడ్బందీగా పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. నెగిటివ్ డీఈఓ వెంట డిప్యూటీ తహశీల్దార్ జి.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుని రథోత్సవం

విశాలాంధ్ర - కోసిగి : మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం అశేష జనవాహిని మధ్య కనుల పండగ సాగింది. తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామ లింగేశ్వర స్వామికి హంపయ్య పున్నమి పురస్కరించుకుని ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ఫల,పుష్ప అలంకరణ, మహా మంగళ హారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు శరణప్ప గౌడ్ , బెట్టన్న గౌడ్ ఆధ్వర్యంలో బిచ్చలి మతం వీరభద్ర శరణచార్య, హొల్వి అభినవ మహంత చరణ గిరి,స్వాములవారు స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో కోలాటలు నిర్వహించారు. మరియు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రథోత్సవాన్ని పురస్కరించు కుని కోసిగి మండలం తో పాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని మెక్కులు చెల్లించారు. అదేవిధంగా వైసీపీ మండల ఇన్చార్జ్ మురళీమోహన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాజారెడ్డి సిబ్బంది బందోబస్తు నిర్వహిం చారు.గౌతంబాబు, ఎర్రి స్వామి,చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - గోనెగండ్ల : గ్రంథాలయాల అభివృద్ధిలో గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. గోనెగండ్ల మేజర్ గ్రామపంచాయతీలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.గిరిబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయాల అభివృద్ధి - ప్రజల భాగస్వామ్యం అనే అంశం మీద గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధిలో సహకరించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులుగ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించడంతోపాటు ఉద్యోగ అవకాశా ల్లో విజయం సాధించే సోపానాలుగా వినియోగించుకోవాలన్నారు. రానున్న బడ్జెట్లో 45లక్షల రూపాయలను కేటాయించి గోనెగండ్ల గ్రంథాలయాన్ని అభివృద్ధి పరిచేందుకుచర్యలు తీసుకుంటామన్నారు.మాజీ సర్పంచ్ నాగేశ్ నాయుడు, వైకాపా నాయకుడు మురళినాయుడు, ఎంపీటీసీ తాయప్ప, హుస్సేన్ పటేల్ బుట్టా గోవిందు గాజులదిన్నె నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మండల పరిధిలోని తెగదొడ్డి గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామికి భూదేవి శ్రీదేవికి కళ్యాణ మహోత్సవం ఆలయ ధర్మకర్తలు లక్క సాగరం లక్ష్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం 9:30గంటలకు భాజా భజంత్రాలతో వేద పండితులు మంత్రోచ్చారణలతో భక్తులు ప్రజల మధ్య ఘనంగా కళ్యాణ మహోత్సవం జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలు తెగదొడ్డి,లక్కసాగరం, పందిర్లపల్లె తదితర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. భక్తులు భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రభ మీద ఉంచి ఊరేగించారు. నిత్యానందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లాల్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకప్ప, తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని తెగదొడ్డి గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈక్రీడాలో కబడ్డీ జట్లు పాల్గొని హెూరాహెూరీ తలపడుతున్నాయి.

రథోత్సవంలో గుడిసె కృష్ణమ్మ

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని కల్లుబావి ఏరియాలో హంపయ్య పౌర్ణమి పురస్కరించుకొని మణికోవ ఆంజనేయ స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని కాలనీవాసులు గురువారం ఘనంగా నిర్వహించారు.కాలనీవాసులు ఆహ్వానం మేరకు టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొని మణికోవు ఆంజనేయస్వామి,కందనాతి మారెమ్మ దేవి లకు కాయ, కర్పూరం సమర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిసె కృష్ణమ్మ రాకతో కాలనీ ప్రజలు ఆనందంతో గంతులు వేస్తూ,ఆమెను ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు,ఎల్ఎల్సి మాజీ చైర్మన్ రామస్వామి,గోపాల్, మల్లికార్జున, హుస్సేన్, బాబురావు పాల్గొన్నారు.